

# వేదన

**శృంగార సాహిత్యాన్ని** వేదాంత పరిభాషలో వినిపిస్తున్నట్లున్న పక్షుల కలకలలకు వెనక వాద్యంలా ఎద్దుల మెడలలో మువ్వలు గణగణ మంటున్నాయి. రెండెడ్లబండిలో ఒత్తుగా గడ్డివేసి దుప్పటీ పరిచాడు బండివాడు. దానిమీద కూర్చున్నాను. కుషన్ సోఫాలో కూర్చున్నట్లు ఉండదుకానీ, ఇదీ ఏదో వింత హాయిగానే ఉంది. ఎండుగడ్డి వాసన, పంటకాలవమీది చల్లని గాలి, గతుకుల గతుకుల రోడ్డులో ఉండిఉండి కుదుపు చిన్నప్పుడెప్పుడో రెండెడ్లబండి ఎక్కాను — మళ్ళీ ఇన్నాళ్ళకు.

గంగలకుర్రులో నాకు కొద్దిగా పొలం ఉంది. ఎక్కడో హైదరాబాదులో ఉద్యోగం చేసుకొంటున్న నాకు స్వంత వ్యవసాయం ఎలానూ సాధ్యంకాదు. కవులు కిస్తే రైతులు నానాతిప్పలూ పెడుతున్నారు. ఏదో ఒక ధరకి దానిని అమ్మెయ్యాలి. ప్రత్యేకం ఈ పనిమీదే నాలుగు రోజులు సెలవు తీసుకొని బయలుదేరాను.

మేళాలు వినిపిస్తున్నాయి. ఏదో శవం ఎదురుగా వస్తూంది. శవం ఎదురువస్తే మంచిదంటారు. మెడిసిన్ చదివి గవర్నమెంట్ డాక్టర్‌గా పనిచేస్తూ, లెక్కలేనన్ని చావుపుట్టుకలను చూసే నాకుకూడా ఈ మూఢ నమ్మకా లేమిటో? నిజాని కిది నమ్మకంకాదు, ఒక భావన. అలవాటుగా వచ్చిన భావన. కొన్నికొన్ని అలవాట్లు, సంప్రదాయాలు రక్తంలో జీర్ణించుకొనిపోతాయి.

ఒకదానినొకటి ఒరుసుకొంటున్న పంటచేలూ, చీర వెనక్కి విరిచి తొడలవరకూ పైకి దోపి చకచకా పనులు చేసుకొనే కూలిజనాలూ—ఇదంతా చూస్తూంటే చిన్నప్పుడు చదువుకొనేరోజుల్లో "పల్లెటూళ్ళు గొప్పవా? పట్నవాసాలు గొప్పవా?" అనే విషయంపై వక్తృత్వంలో పోటీలు పడటం గుర్తువచ్చి నవ్వు వచ్చింది. ఇప్పుడు పల్లెటూళ్ళు పల్లెటూళ్ళలా లేవు. పట్నవాసపు కృత్రిమ వాతావరణాన్ని మరింత కృత్రిమంగా ఎరువు తెచ్చుకుంటున్నాయి.

"ఊరింకా ఎంత దూరముందోయ్?"

బండి తోలుతూనే, దారినపోయే ఎవరో పిల్లతో సరసమాడబోతున్న బండివాడు ఉలిక్కిపడ్డాడు.

"వచ్చేశామండి. అరమైలుంటుంది. ఎవరింటి కాడికండి?"

"కరణంగారింటికి పోనియ్యి."

కరణం రాఘవయ్యగారూ,మా నాన్నగారూ ఒకప్పుడు చాలా స్నేహంగా ఉండేవారు. నేను చిన్నప్పుడు అప్పుడప్పుడు వాళ్ళింటికి వెళ్ళేవాడిని. ఆయన నన్ను గుర్తుపడతారో, లేదో? నన్ను నేను పరిచయం చేసుకోవలసి రావడం ఎంత అవస్థ!

చిన్న కుదుపుతో బండి ఆగింది.

"కరణంగారిల్లిదేనండి." బండిలోనుంచి దుముకుతూ అన్నాడు బండివాడు. నేను బండిలోనుంచి దూకాను. నా హోల్డాలూ, మెడికల్ బాగూ కింద పెట్టాడు. వాడి చేతిలో రెండు రూపాయలు పెట్టాను. సంతోషంగా నాకు నమస్కారంచేసి హోల్డాలు చేత్తో పట్టుకొని కరణంగారి ఇంట్లోకి దారి తీశాడు.

బెదురుగా "రాఘవయ్యగారూ!" అని పిలిచాను.

నల్లగా ఉన్న ఒక ఆజానుబాహువు "ఎవరది?" అంటూ బయటకు వచ్చాడు.

ఈయనేనా రాఘవయ్యగారు? ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. సరిగా గుర్తు రావటంలేదు.

"రాఘవయ్యగారు ..." నసిగాను.

"నేనేనయ్యా! ఏం కావాలి?" గద్దించినట్లు మాట్లాడాడు.

నా మెడికల్ బాగ్ చూస్తైనా నేనంటే గౌరవం కలగలేదా? లేకపోతే, అదేమిటో అర్థం కాలేదా? అవతలి వాళ్ళు నెమ్మదిగా మాట్లాడితే, నాకూ ఎక్కడలేని నమ్రతా వస్తుంది. ఆయన గద్దించేసరికి నాకు కావలసినంత ధైర్యం వచ్చింది.

"నేనండీ! ప్రకాశరావుగారి అబ్బాయిని, సుబ్బారావుని." దబాయింపుగా అన్నాను.

నేను దబాయించేసరికి ఆయనకు నేనంటే చాలా గౌరవం కలిగింది.

"అరె! నువ్వటోయ్! ప్రకాశం కొడుకువా? ఇంకా ఎవడివో అనుకొన్నాను. చిన్నప్పుడు ఎంతో ముద్దొస్తూ ఉండేవాడివి. పెద్దవాడివయిపోయావు! కూర్చో కూర్చో." లోపలినించి వాలుకుర్చీ తెచ్చి వేశాడు.

అమ్మయ్య! తొందరగానే గుర్తుపట్టాడు. చిన్నప్పుడు ముద్దొచ్చేవాడినిట! ఇప్పుడు రావటంలేదు కాబోలు! బతికాను. అంత విగ్రహమూ నన్ను ముద్దుపెట్టుకోవటానికి తయారయితే పొలాన్ని వదిలేసి పరిగెత్తవలసివచ్చేది.

నా హోల్డాలువంక భయంభయంగా చూసే కరణాన్ని చూస్తే నవ్వు వచ్చింది. ఒకప్పుడు పల్లెటూరివాళ్ళు ఎందరు అతిథులు వచ్చినా బెంగపడేవారు కారు. ఏమున్నా ఏం లేకపోయినా ఊరగాయా, మీగడపెరుగూ ఏ ఇంట్లోనైనా పుష్కలంగా ఉండేవి. పాడిఉన్న ఇంట్లోనించి ఎవరికైనా అవసరానికి ఉచితంగా పాలు, పెరుగు దొరికేవి. కానీ, ఇప్పుడు పల్లెటూళ్ళు పల్లెటూళ్ళలా లేవు. ఇక్కడా అతిథులంటే భయమే!

మానుషి జన్మ ఎత్తిన తరవాత కష్టాలు అనుభవించని ప్రాణి కనుపించదు. దిక్కులేని వారికి దేవుడే దిక్కు అని ఎంతగా సరిపెట్టుకుందామన్నా అలాంటివారు పడే కష్టాలకు అంతూ పొంతూ ఉండదు. కనీసం ఒక చల్లటి ఉపశమనవాక్యం ఎవరినోటంట అయినా విన్నా వారిపట్ల కృతజ్ఞతాభావంతో హృదయమంతా నిండిపోతుంది. కష్టాలుపడేది స్త్రీ, సానుభూతి చూపేది పురుషుడూ అయితే?

పాడిఉన్నా, పాలన్నీ అమ్ముడుపోవటంవల్ల పాలకు కరువే!

ముందు నేసి ఇంట్లో ఉండబోవటంలేదని స్పష్టం చేస్తేకానీ ఈయనకు నా మాటలు అర్థమయ్యేలా లేవు.

"ఈ ఊళ్ళో హోటలులాంటి దేదైనా ఉందా?" అన్నాను. నా ప్రశ్నకు ఆయన ముఖం వికసించింది.

"ఈ పల్లెటూళ్ళో హోటళ్ళలా ఉంటాయయ్యా! కానీ, చిట్టితల్లి అని ఒకావిడ ఉంది. పూటకూళ్ళ ఇల్లొకటి నడుపుతూంది. మాంచి శుచిగా శుభ్రంగా వండుతుంది. నిన్ను మా ఇంట్లోనే ఉంచుకొనేవాడిని. కాని నిన్ననే ఇంటినిండా చుట్టాలు దిగారు, మా మేనత్త మనమరాలూ, దాని తోటికోడలూ, వాళ్ళ పిల్లలూను. ఇల్లు కిటకిటలాడి పోతూంది."

నిజమే కావచ్చు. అబద్ధమని ఎందుకనుకోవాలి? అబద్ధమని రూఢిగా తెలిసేవరకూ ఏదైనా నిజమనుకోవటమే మంచిది.

నెమ్మదిగా వచ్చిన పని చెప్పాను. నాకీ వ్యవహారాలు తెలియవు కనక మాటసాయం కావాలన్నాను. తప్పకుండా చేస్తానన్నాడు.

"తొందరపడితే లాభంలేదయ్యా! మనం తొందరపడుతున్నామని తెలిస్తే ధర పలకదు. అవసరంపడితే రెండురోజులు ఆగలేవా?"

"చూడండి. ఎంత తొందరగా తెమిలితే అంత మంచిది. అవతల హాస్పిటల్లో నేను లేకపోతే ఇబ్బంది."

"నువ్వు డాక్టరువటోయ్!"

బ్రహ్మాండంగా ఆశ్చర్యపోయాడు. ఒకసారి సర్దుకుని కూర్చున్నాడు. మరోసారి గౌరవంగా చూశాడు.

"మూడురోజులనించీ మా చిన్నమ్మాయికి విరేచనాలు. ఏదో వేస్తున్నాం . . ."

"చూడమంటారా?" ఆయన మాటలు పూర్తికాకుండానే అన్నాను.

"ఆహా, తొందరలేదు. నువ్వు స్నానం, భోజనం అదీ కానిచ్చుకొని స్తిమితంగా చూద్దువుగాని. చిట్టితల్లి ఉండటానికి గదికూడా ఇస్తుంది. మా ఇంట్లోనే ఉండమందునుకాని నిన్ననే . . ."

"ఫరవాలేదులెండి. పొలం విషయం చూసిపెడితే మీ మేలు మరిచిపోలేను."

"ఇంతగా చెప్పాలిటయ్యా! మీ నాన్న, నేను ఎంత స్నేహితులం? 'ఒరేయ్' అంటే 'ఒరేయ్' అనుకొనేవాళ్ళం. నిన్ను నా ఇంట్లో ఉంచుకోలేకపోయినందుకు . . ."

## సి. హెచ్. లక్ష్మి

"చిట్టితల్లిగారిల్లెక్కడండి?"

"అదిగో, ఆ పెద్దబావి కనిపిస్తోందా? దానికి కుడిపక్కగా తిన్నగా వెడితే ఆరో పెంకుటిల్లు."

హోల్డాలు తీసుకోబోయాను.

"అది అక్కడ ఉంచవయ్యా! మా పాలేరు తీసుకువస్తాడు. నువ్వు నడు. నేను పంపుతాను."

బావివైపు నడిచాను. బావి దగ్గిర ఎవరో ఆడవాళ్ళు స్నానం చేస్తున్నారు. పల్లెటూళ్ళలో ఇప్పటికీ కొంత కొంతమంది వయసులో ఉన్న ఆడవాళ్ళుసహితం కాలవలలోనూ, చెరువులలోనూ స్నానాలు చేసి తడిబట్టలతో రోడ్డుమీదినించి నీళ్ళు తీసికెళతారు.

యాథాలాపంగా అటు చూశాను. తడిబట్టలతో చక్కని అజంతా శిల్పంలాఉన్న ఒక అమ్మాయి నా దృష్టిని కొద్ది క్షణాలు ఆకట్టుకుంది. ఆమె కళ్ళలో కదిలిన తీక్షణరేఖలు నా పొరపాటు నాకు తెలియజెప్పగా చటుక్కున చూపు తిప్పుకున్నాను. ఆ అమ్మాయి చకచకా నడవసాగింది. నేను వెనకనే ఉన్నాను. మధ్యలో ఒకసారి వెనక్కి తిరిగి విసురుగా ముఖం తిప్పుకుంది. ఆ విసురు చూస్తే ఆమెను నేననుసరిస్తున్నాననేదురభిప్రాయంతో ఉందనిపించింది. నా దారికూడా అదేననీ, ఆమెను నేను వెంబడించటంలేదనీ ఎలా తెలియజెప్పాలి? మళ్ళీ ఒకసారి వెనక్కి తిరిగింది. ఈసారి కాంక్రించి ఉమ్మేసింది. నాకు ఒళ్ళు మండింది. ఆవిడ భుజాలు పట్టి నిలేసి, "ఓ తిలోత్తమా, నీ సౌందర్యానికి మూర్ఛిల్లే రసికచక్రవర్తిని కాను. నా పనిమీద సాగిపోయే బాటసారిని" అని ముఖంమీద చెప్పాలనిపించింది.

ఆ అమ్మాయి సరిగా రాఘవయ్య గుర్తుచెప్పిన ఇంట్లోకే వెళ్ళింది. కొంపదీసి చిట్టితల్లి అంటే ఈ అమ్మాయేనా? ఇంత చిన్నపిల్ల పూటకూళ్ళ ఇల్లు నడుపుతూంది? లోపలికి నడిచాను. లోపలి గదిలో నీళ్ళు దింపుతూన్న ఆ అమ్మాయి నుద్దేశించి "చిట్టితల్లిగారూ!" అన్నాను.

"ఎవరూ?" అంటూ మరో గదిలోంచి వచ్చింది అసలు చిట్టితల్లి.

మూడు రోడ్డురోలర్లు కలిసినంత లావుగా ఉంది. పిడకలాంటి ముడిమీద పొగడపువ్వులు పెట్టుకొని, ఒక టెర్లిన్ చీర చుట్టబెట్టుకున్న ఆ చిట్టితల్లిని చూస్తూ కొద్ది క్షణాలు నోట మాటరాక నిలబడ్డాను.

నా చూపులకు సగర్వంగా ఓసారి తిప్పుకొని "ఏం కావాలండీ?" అంది.

ఆ ఒయ్యారానికి తలకిందులయ్యాను. తప్పదు, వచ్చిన పని అవ్వాలి.

"నాది ఈ ఊరు కాదు. పనిమీద వచ్చాను. నాలుగైదు రోజు లుంటానేమో? నాకు వసతి, భోజన సదుపాయమూ ఇక్కడ దొరుకుతాయని చెప్పారు. అందుకని వచ్చాను," గబగబా చెప్పాను.

బ్రహ్మాండమైన ఆ వసతి గృహంలో వసతికిచ్చే గదులు రెండే ఉన్నాయి. ప్రస్తుతం రెండూ ఖాళీలే! ఒకదానిలో నన్ను ఉండమంది, ఏళ్ళతరబడి జననివాసం లేనట్లు గది అంతా దుమ్ముకొట్టుకుపోయింది. నేల గచ్చుది. అదొకటే నయం. అప్పటికప్పుడు ఇల్లంతా

ఊడిపించింది. గొప్పగా ఒక తుంగచాప పరిసించింది. గదికి తలుపులు లేవు!

రాఘవయ్యగారి పాలేరు నా హోల్డాలూ, సూటు కేసూ, మెడిసిన్ బాగూ తీసుకువచ్చాడు.

తుంగచాపమీద హోల్డాలు పరిచాను. తువ్వాలూ సబ్బూ తీసుకొన్నాను.

"స్నానాల గది ఎక్కడ?"

"స్నానాల గదేమిటి? పెద్ద బావి ఉంది." నవ్వు ఆపుకొంటూ అంది.

"సామానులు భద్రంగా ఉంటాయా?"

తలుపులులేని గదివంక సందేహంగా చూస్తూ అన్నాను.

"పూచికపుల్ల పోదు. నేనున్నాను గదా!" గర్వంగా అంది.

లుంగీ కట్టుకొని, తువ్వాలు భుజంమీద వేసుకొని బావి దగ్గరికి వచ్చాను. బావి దగ్గిర ఇందాకటి అమ్మాయి నీళ్ళు తోడుతూంది. పెద్ద బాల్చీ కష్టంగా లాగుతూంది. 'నేను తోడనా?' అనాలనిపించింది. వెనకటి అనుభవం గుర్తువచ్చి ఊరుకున్నాను.

ఆ అమ్మాయి నావంక చూసింది. ఈసారి చూపు లలో తీక్ష్ణత్వం లేదు. 'క్షమించండి' అన్నట్లుగా ఉన్నాయి. ఆమె చూపులు సహజంగా జాలిగా ఉన్నాయి. దేన్నో చూసి బెదురుతున్నట్లుగా ఉన్నాయి. పెదిమలు పళ్ళతో నొక్కిపట్టింది; బాల్చీ లాగటంలో కష్టాన్ని భరించటానికి కాబోలు! ఎందుకో, ఎంత కష్టాన్నైనా అలాగే భరించగలదనిపించింది.

"నేను తోడిపెట్టనా?" ధైర్యంచేసి అన్నాను.

ఏదో అసంభవం విన్నట్లు చూసింది. "మీరు పెద్ద డాక్టరు. నీళ్ళు తోడతారా?"

నామీద కోపం పోవటానికి కారణం తెలిసిపోయింది.

"ఎవరు చెప్పారు?"

"రాఘవయ్యగారి పాలేరు."

"డాక్టర్ని కనకనే నీ కష్టం గుర్తించాను. సాయం చేస్తానంటున్నాను."

ఆమె సమాధానం చెప్పలేదు. బరువుగా నిట్టూర్చింది. కళ్ళు ఏదో ఆలోచిస్తున్నట్లున్నాయి. స్వతంత్రంగా చేతిలో తాడు అందుకొన్నాను. బిత్తరపోయి చూసింది. 'వద్దు' అనటానికికూడా సాహసించలేని భయం ఆమె కళ్ళలో ప్రతిఫలిస్తూంది. నేను బిందెలో నీళ్ళు తోడుతూంటే, బొమ్మలా చూస్తూ నిల్చుంది. నూతిమీద ఉంచిన చెయ్యి నూతిమీదే ఉంది. 'న యయౌ న తస్థౌ' భంగిమలో ఉన్న కాళిదాస మహాకవి ఉమాదేవి గుర్తువచ్చింది. బిందె నిండిపోయింది.

"తీసుకువెళతావా?" అన్నాను.

ఉలిక్కిపడి, బిందె భుజానికెత్తుకుని నడిచింది.

ఆమె ఎవరో, ఏమిటో తెలుసుకోవాలనిపించింది. బెదురుగా ఉన్న ఆ చూపులూ, భయంతో వణికే ఆ పెదవులూ నన్ని ప్రశ్న అడగనియ్యలేదు. చిట్టితల్లికి బంధువు కావచ్చు; ఏదైనా కావచ్చు. ఏదైతే నా కెందుకూ?

స్నానంచేసి వచ్చేసరికి చిట్టితల్లి గొంతు తార స్థాయిలో పలుకుతూంది.

"బిందెడు నీళ్ళు తేవడానికి ఇంతసేపు పట్టిందా? ఏం చేస్తున్నావే? ఎక్కడుంటే అక్కడే నిలబడిపోతావు. ఒక్క తినడానికి ఏ సుకుమారమూ లేదు. మిగిలిన అన్నింటికీ సుకుమారాలే! నేనుకనక వేగుతున్నాను. తొందరగా ఆ వంట తగలబెట్టు; పొద్దెక్కిపోతూంది."

నన్ను చూసి గొంతు కొస్త తగ్గించింది.

"చూడండి, దిక్కులేనిదని చేరదీశాను. ఏ లోటూ రాకుండా కన్నతల్లిలా చూస్తున్నాను. మొండిఎద్దులా మొరాయిస్తుంది. పనిపాటలు చెయ్యకుండా గడపటానికి మనమేం మహారాజులమా?"

ఆ అమ్మాయివంక చూశాను. సరిగ్గా ఆవిడా అప్పుడే నావంక చూసింది; చిట్టితల్లి మాటలు విని నే నేమను కొంటానో అని కాబోలు! చటుక్కున తల దించుకుని వెళ్ళిపోయింది.

చిట్టితల్లి దగ్గిర నిలబడి అజమాయిషీ చేస్తూంటే ఆ అమ్మాయి వడ్డించింది. వంట చాలా బాగుంది. ఆ మాటే అన్నాను.

"అంతా నేను దగ్గిరుండి చేయిస్తాను. స్వయంగా చెయ్యను" అంది చిట్టితల్లి.

"అందుకే బాగుంది" అన్నాను.

నా వ్యంగ్యం చిట్టితల్లికి అర్థంకాకపోయినా, ఆ అమ్మాయి కర్థమైందని ఆమె నవ్వు ఆపుకొనే ప్రయత్నాన్నిబట్టి అర్థమయింది. క్షణమయినా ఆ ముఖంలో నవ్వు చూడగలిగినందుకు చాలా సంతృప్తి కలిగింది.

భోజనంచేసి కొంతసేపు విశ్రాంతి తీసుకొన్న తరవాత రాఘవయ్య ఇంటికివెళ్ళి వాళ్ళఅమ్మాయిని పరీక్షచేసి మందు ఇచ్చాను. రాఘవయ్య నాకు ఒక పెద్ద పళ్ళెంలో రెండు డజన్ల గారెలూ, వెండిగ్లాసులో అర్ధసేరంత కాఫీ ఇచ్చాడు. అంత తినలేనని చెప్పినా వినిపించుకోలేదు. కష్టపడి కాఫీ ఫలహారాలు ముగించి పొలం విషయం త్వరగా తెమల్చమని మరోసారి హెచ్చరించి ఇవతలికి వచ్చాను.

రెండు రోజులు గడిచాయి. పొలం అమ్మకం కాలేదు.

ఆ బెదురుచూపుల పిల్లపేరు లీల అని తెలిసింది. సరిగ్గా నేను స్నానానికి వెళ్ళినపుడే నీళ్ళకి వచ్చేది. నేనే తోడేవాడిని. మొదటినాటి భయం పోయింది. ఏదో ఒక అపూర్వ దృశ్యాన్ని చూస్తున్నట్లు చూస్తూ నిల్చునేది.

ఆ మరునాడుకూడా బేరం కుదరలేదని రాఘవయ్యగారు చెప్పేసరికి ఎక్కడలేని చిరాకూ వేసింది. వంట రుచిగా ఉన్నా, చిట్టితల్లి దగ్గిర కూర్చుని "ఇది తినండి, అది తినండి, మరికాస్త వేసుకోండి" అంటూ చూపించే ఆదరణ భరించలేకపోతున్నాను. అస్తమానం లీలమీద గుయ్యిమనే ఆమె వాగ్ధాటికి తల పగిలిపోతూంది. ఆ రోజు ఊరుకోలేక చటుక్కున, "పాపం, మంచిపిల్ల" అన్నాను.

చిట్టితల్లి ముఖం కోపంతో ముటముటలాడింది.

"ఆఁ మంచి! గెడమంచి! బాబు తాగి తందనాలాడి చచ్చాడు. అమ్మ ఎవడితోనో పారిపోయింది. దీని మంచే చెప్పుకోవాలి. ఊరంతా ఛీకొడితే చేరదీశాను. వెధవ జాలిగుండె."

పళ్ళు నూరుకొంది. ఆ వెధవ జాలిగుండెను తలుచుకొని పశ్చాత్తాపపడుతూంది కాబోలు!

లీలవంక చూశాను. కళ్ళలో గిరగిర తిరిగే నీళ్ళు అతి ప్రయత్నంమీద ఆపుకుంటూంది. జాలివేసింది.

"తల్లీ, తండ్రీ ఏదో చేస్తే ఈ అమ్మాయి ననటం

## విజ్ఞప్తి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణకు ఉద్దేశించిన కథలు, కవితలు, నవలలు, చిత్రాలు—ఏవైనా ఈ దిగువ చిరునామాకు పంపవలసి ఉన్నది:


ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మద్రాసు — 2

పోటీలకు ఉద్దేశించినవి అయితే కవరుమీద ఆ సంగతి స్పష్టంగా పేర్కొనవలసి ఉన్నది.

ఉత్తరాలు శీర్షికకు, 'జవాబులు' శీర్షికకు వ్రాసేవారు తమ పూర్తి చిరునామా ఇవ్వడం అవశ్యకం. లేకపోతే అలాంటి ఉత్తరాలను పరిశీలించడం సాధ్యంకాదు.

ఎడిటర్



అసామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

అందరికీ అందుబాటులో అత్యుత్తమ సాహిత్యం!
విశ్వనాథ సత్యనారాయణ
భ్రమరవాసిని 8.00
సంజీవకరణి 4.00
పాతిపెట్టిన నాణెములు 4.00
సింగరాజు లింగమూర్తి
జీవనగతులు 3.50
వయసువరించినవెన్నెల 4.00
ఆదర్శాలు అంతర్యాలు 4.00
పాకలపాటి లక్ష్మి
అర్చన 4.00
ముసునూరి
అనురాగ మందిరం 4.00
గంటి సుబ్రహ్మణ్యశర్మ
జయాపజయములు 8.00
దివాకర్ల విశాలాక్షి
వైకుంఠపాళి 5.00
దివాకర్ల సోమనాథశాస్త్రి
కౌముకరేఖలు 3.00
ముద్దంశెట్టి హనుమంతరావు
జడుమాత్రలు 5.00
సహనశీలి 3.00
ఎడురీత 3.00
కె.వి.యస్. అన్నపూర్ణ
పుట్టిల్లు 3.00
సూగూరి శాంతాదేవి
ఆటవిసారి 6.00
పాణిగ్రహణం 5.00
రక్తతిలకం 5.00
వి.పి. పద్ధతి లేదు ముందుగా సొమ్ము పంపిన వారికి పోస్టేజి ఉచితం!
గాయత్రీ పబ్లికేషన్స్ ఏలూరురోడ్ విజయవాడ2

బుతుక్రమం ఆలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి


దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయిన బహిష్టుకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును
1 అన్ని సందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించదు
Mfrs:- SEENU & CO., MADRAS-21
పెద్ద కెమిస్టులు, డ్రగ్గిస్టులు అందరి వద్దను లభిస్తున్నది

ఐటెక్స్ సౌందర్యదోహదములు
★ ఐటెక్స్ (కాటుక)
★ ఐటెక్స్ బిందీ
★ ఐటెక్స్ కుంకుం పేస్టు
తయారుచేసినవారు:
అరవింద్ లేబరెటరీస్
పో. బా. 1415 మద్రాసు-17



దేనికి?"

లీల కళ్ళు వెలిగాయి. చిట్టితల్లి కళ్ళు మండాయి.

"రక్తంలో గుణం ఎక్కడికి పోతుంది? అందుకే దీన్ని చేరదియ్యడానికి అందరికీ భయం."

చిట్టితల్లితో వాదించాలనే కోరికకానీ, వాదించే ఓపికకానీ నాకు లేవు. మౌనంగా భోజనం ముగించాను.

ఆ సాయంత్రం లీల వడ్డించలేదు. చిట్టితల్లే వడ్డించింది.

"పాపం, మీరే వడ్డిస్తున్నారేం?"

"పొద్దున్న ఉన్నమాట అన్నానని అలిగి జ్వరం వచ్చిందని వంకబెట్టి ముసుగుపెట్టింది. అన్నిపాట్లూ నాకే!" విసుక్కుంది.

"నిజంగా జ్వరమేనేమో? ఒకసారి చూస్తాను."

"ఏమీ అక్కర్లేదు. ఇట్లాంటి వగలాడి వేషాలు వెయ్యటం దీనికీ, పడటం నాకూ అలవాటయిపోయింది. నా కర్మ! వెధవ జాలిగుండె ఉండబట్టి ఇన్ని తిప్పలు."

తల కొట్టుకొంది. ఇంకేమీ మాట్లాడలేకపోయాను.

ఆరోజు ఎందుకో ఒక రాత్రివేళ మెలకువ వచ్చింది. ఎక్కడినుండో సన్నగా మూలుగు వినిపిస్తూంది. జాగ్రత్తగా విన్నాను. ఉండిఉండి మూలుగు గట్టిగా వినిపిస్తూంది. మంచంమీదనించి లేచి మూలుగు వినవస్తున్న వైపు నడిచాను. దక్షిణపువైపు చిన్న గదిలోనించే వినిపిస్తూంది. అది లీలగది. లీలకు జ్వరం ఎక్కువయిందా? ఆత్రంగా లోపలికివెళ్ళాను. లీల మూలుగుతూ పడుకుని ఉంది. శ్వాస బరువుగా వస్తూంది. చీర అస్తవ్యస్తంగా ఉంది. కొంచెం ముందుకు వంగి "లీలా!" అన్నాను. వినిపించుకోలేదు. నుదుటిమీద చెయ్యి వేశాను. పేలిపోతూంది. నా స్పర్శకు కళ్ళు తెరిచింది. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. నుదుటిమీది నా చేతిని తీసుకుని ఆర్తితో హృదయానికి హత్తుకుంది. ఆ కోలకళ్ళనిండా నీళ్ళు, ఆ నీళ్ళలో కరుగుతున్న దిగులు. నెమ్మదిగా నా చెయ్యి విడిపించుకొని లేవబోయాను. కళ్ళతో వద్దని ప్రార్థించింది. "ఇప్పుడే వస్తాను" అని లేచి నా గదిలోకి వచ్చి నా మెడికల్ బాగ్‌తో తిరిగి వచ్చాను. నా చేతిని చెక్కిలికి ఆనించుకుని ఏడ్చేసింది.

"ఎందుకిలా ఏడుస్తావు? ఈమాత్రం జ్వరానికే ఇలా ఢీలా అయిపోతారా? రేపటికల్లా నయమయిపోతుంది." లాలనగా అన్నాను.

కళ్ళు తుడుచుకుంది. "నాకు జ్వరం వచ్చినందుకు బాధ లేదు." నీరసంగా అంది.

"మరెందుకు ఏడుస్తున్నావూ?"

కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా ఉంది. "మీరు నన్ను చూసి జాలిపడగలరా?" నా ముఖంలోకి చూస్తూ అంది.

కరిగిపోయాను. ఆమె చేతిని మృదువుగా నొక్కి, "అనవసరంగా బాధపడకు. నువ్వు బాధపడుతూంటే చూడలేకపోతున్నాను" అన్నాను.

"అయితే, మీ దగ్గ రేదైనా మంచి విషం ఉంటే ఇవ్వండి. ఈ యాతననుండి నాకు విముక్తి కలిగించండి."

నా వృత్తిలో ఇట్లాంటి మాటలు తరుచు వింటూనే ఉంటాను. లోలోపల నవ్వుకొని, లాలనగా ఆమె శిరస్సు నిమిరి, "మామూలు జ్వరం. విశ్రాంతీ, మందూ, మాకూ లేక ఇలా ఉంది. రెండు రోజుల్లో మామూలుగా లేచి తిరుగుతావు" అన్నాను.

"అక్కర్లేదు. లేచి తిరగక్కర్లేదు. లేచి నేను పొంద నలిసిన మహాద్భాగ్యాలేవీ లేవు. బతుకుతో అన్నివిధాలా దెబ్బలాడి దెబ్బలాడి అలిసిపోయాను. ఎందుకు బతకాలి? ఎవరికోసం బతకాలి? నా అనేవాళ్ళు ఎవరున్నారు? మృత్యువుకన్నా నాకు ఆత్మీయులెవరు? అక్కడతప్ప నాకు ప్రశాంతి ఎక్కడ?".

గుండెలు పగిలేలా ఏడుస్తూంది. ఎన్నాళ్ళుగానో ఘనీభవించిన లావా నా అనునయంతో కరిగి కన్నీరై ప్రవహించింది. విలువిల్లా కదిలిపోయాను. ఆప్యాయంగా ఆమె కళ్ళు తుడిచాను.

"బతుకు ముందుముందు నీకోసం ఏం దాచిందో నువ్వేం చెప్పగలవు? ఇలా చూడు. నాకోసం మందు వేసుకో! నీ జ్వరం నయంకావాలని నేను కోరుకుంటున్నాను."

కన్నీళ్ళ మధ్యనుంచి వింతగా చూసింది. "మీ రెవరు నాకు?"

నవ్వాను. "పిచ్చిపిల్లా! రెండు మానవహృదయాల మధ్య ఏ చుట్టరికాలు కావాలి?"

నా మాటలు ఎలా అర్థమయ్యాయో ఏమో ఆమె కళ్ళలో సంతోషరేఖ తళుక్కున మెరిసింది. ఆ మెరుపును చూడగలిగిన ఆనందాన్ని దేనితో పోల్చను? మనం నాటిన మొక్క పెరిగి చిగిర్చి, మొగ్గ తొడిగి విరబూసినప్పుడు కలిగే ఆనందంతోనా? ఆకలితో మాడుతున్నవాడికి కడుపునిండా అన్నంపెట్టినప్పుడు వాడి కళ్ళలో సంతృప్తి, కృతజ్ఞత చూడగలిగినప్పటి ఆనందంతోనా? పరీక్ష రుసుం కట్టలేని విద్యార్థికి రుసుం కట్టినప్పుడు, అతను పరీక్ష పాసై, మీ దయవల్ల డిగ్రీ వచ్చిందని సంతోషంతో చెప్పేటప్పుడు, వినగా కలిగే ఆనందంతోనా?

లీల మాత్ర వేసుకుంది. నా చేతులతో ఏమి ఇచ్చినా కాదనదు. నామీద అంతులేని విశ్వాసం. నేను తనవాడి నన్న ధీమా! ఎండి వాడిపోయిన తన బ్రతుకులో నేను పన్నీటిజల్లు కురిపించగలనన్న ఆశ!

ఆమె విక ఏ జ్వరాలూ ఏమీ చెయ్యలేవు. ఏ బాధలూ ఆమెను భయపెట్టలేవు. నన్ను తన చూపుల ముందుంచు కొని మిగిలిన యావత్ప్రపంచాన్నీ నిర్లక్ష్యంగా వెక్కిరించ గలదు.

లేచి రాబోయిన నన్ను కదలనివ్వలేదు. ఆమె నా చుట్టూ అల్లిన ఆశాలతలను తెంపి లేవగలిగే శక్తి నాకూ లేకపోయింది.

మరునాటికి లీల జ్వరం కొంచెం నెమ్మదించింది. అంత నీరసంలోనూ ఆమె కళ్ళు వింతగా మెరుస్తున్నాయి. ఆమె కళ్ళు అంత అందంగా మెరవగలవని నాకు తెలియదు.

చిట్టితల్లి చక్కగా మిరియాల కషాయం పెట్టి ఇచ్చింది లీలకు. పాపం, వెధవ జాలిగుండె!

ఆ పగలంతా నేను లీల విషయం పట్టించుకోలేదు. రాత్రి పద్దుపూర్తిగాక నా మెడికల్ బాగ్‌తోసహా లీల గదిలోకి వెళ్ళాను.

లీల మాత్ర వేసుకోనంది. కోపం నటించి "మళ్ళీ మొదలా?" అన్నాను.

మూతి ముస్సాలా పెట్టి "నేను మాత్ర వేసేసుకుంటే మీరు వెళ్ళిపోతారేమో?" అంది.

నవ్వాను. తనకు నిద్ర పట్టేవరకు వెళ్ళనని చెప్పాను. నేను మాట్లాడవద్దన్నా వినిపించుకోకుండా, ఆరోజు లీల నాకు ఎన్నో సంగతులు చెప్పింది.

లీల దురదృష్టానికంతా కారణం చిట్టితల్లే! లీల తల్లి పరమసాధువు. లీలతండ్రి చిట్టితల్లివలలో పడి లీల తల్లిని ఆదరించేవాడుకాడు. పైగా రోజూ డబ్బు కోసం పీడించేవాడు. ఇవ్వకపోతే బాదేవాడు. ఈ బాధలు పడలేక లీల తల్లి ఇంట్లోనించి పారిపోయింది. "ఎవడితోనో లేచిపోయింది" అని చిట్టితల్లి ప్రచారం చేసింది. ఆడది ఒంటరిగా వెళ్ళిందనటంకంటె ఎవడితోనో వెళ్ళిందనటం వినటానికీ, చెప్పుకోటానికీ రక్తిగా ఉంటుంది కనక జనులంతా చిట్టితల్లి మాటలే ఆదరించారు. చిట్టితల్లి ప్రోద్బలంమీదనే తండ్రి లీలను చిట్టితల్లి దగ్గిర ఉంచాడు. ఊపిరాడని పని, కడుపుకు తిండి—ఇంతే జీవిత మయిపోయింది లీలకు. పోనీ, అలాగే యాంత్రికంగా నెట్టుకువస్తూంటే మరో బెడద చుట్టుకుంది. చిట్టితల్లి కూర్చున్న చోటినించి లేవలేదు. అందరికీ లీలే వడ్డించాలి. వచ్చినవాళ్ళలో చాలామంది కళ్ళు లీలమీద పడేవి.

> మనం మొట్టమొదట ప్రేమించేది,
> చిట్టచివర ప్రేమించేదికూడా మనల్నే.
>
> —టాలీ
>
> ● ● ●
>
> ప్రేమ పెంపొందేకొలది విచక్షణా
> శక్తి సన్నగిల్లుతుంది.
>
> —రోచ్ ఫోకాల్డ్

ఈ అమ్మాయి ఎవరు? ఇక్కడెందుకుంది? ఎప్పటికీ ఇక్కడే ఉంటుందా? ఏఏ పనులు చేస్తుందేమిటి? ఇలాంటి ప్రశ్నలు తలెత్తనపడేవి. చిట్టితల్లికి ఒళ్ళు రెపరెపలాడి పోయేది. పాపం లీల అందమైనదవటం ఆవిడ సహించలేకపోయేది.

"వెధవ భోగంవేషాలు. అలా ఇకిలిస్తూ నించోక పోతేనేం?"

"తనంత అందగత్తె లేదని గర్వం. నిజంగా అందమే ఉంటే పట్టలేకపోయేము."

"ఒళ్ళు దగ్గిర పెట్టుకో! పైట వంటినిండా వేసు కోవాలని తెలియదా?"

"ఇప్పుడా ఉతికిన చీర కట్టుకోలేదని ఎవడేడ్చాడో? రోజురోజూ ఇంతింత సబ్బు అరిగిపోవాలి. బాగా ముస్తాబయితే, ఏ రాజాగారో వచ్చి ఎగరేసుకుపోతాడని ఆశ కాబోలు! ఈ మాడుమొహాన్ని ఎవరూ చూడలేరని తెలియదు."

ఇలాంటి మాటలతో కుళ్ళబొడుస్తూండేది. పోనీ, వడ్డనలకు తాను రానంటే అదీ పనికిరాదు. లీల వడ్డించకపోతే, వచ్చే కొద్దిమందీ రారని తెలుసు. తన వ్యాపారం పడిపోతే ఎలా? అటు తినడానికి వచ్చేవాళ్ళ దాహాజ్వాలల మధ్య, ఇటు చిట్టితల్లి ఈర్ష్యాజ్వాలల మధ్య లీల లేతమనసు భగ్గున మండుతూంది.

లీల నాతో ఈ సంగతులన్నీ బాధపడుతూ ఏడుస్తూ చెప్పలేదు. నవ్వుతూ ఏదో కథలాగ చెప్పింది. అవును. అదంతా ఒక కథే. ఆ కథకూ తనకూ ఇంక సంబంధం లేదు. తానిప్పుడొక మహారాజ్ఞి. ఇట్లాంటి కథలు వంద తలుచుకొని నవ్వుకోగలదు. తానిప్పుడు పొంద గలుగుతున్న ఆనందంతో పోలిస్తే, ఆ బాధలన్నీ ఏపాటివి?

లీల నన్నే వాగ్దానాలూ కోరలేదు. భవిష్యత్తును గురించి ప్రశ్నించలేదు. నన్నుగురించి తెలుసుకోవా లను కోలేదు. ఏ కోరికలు, ఏ ఆశలు ప్రకటించలేదు. ఊరికే నా చేతిని తన చేతిలో బంధించుకొనేది, ఆ బంధం ఎవరూ విడదీయలేరన్నట్లు, అది విడిపడడం అసాధ్య మన్నట్లు.

లీల జ్వరం నెమ్మదించింది. బలానికి మందు తీసు కుంటే మంచిది.

అంతలో రాఘవయ్యగారు వచ్చి పొలానికి బేరం వచ్చిందని చెప్పారు.

"ఎకరానికి ఎనిమిది వేలు పలికిందయ్యా! ఇంక ఫైసలు చేసేద్దాం" అన్నారు.

"సరే, కానియ్యండి" అన్నాను. నా కంఠం నాకు తెలియకుండానే నిరుత్సాహంగా ధ్వనించింది.

ఎక్కువ రోజులు ఆ ఊళ్ళో ఉండవలసివచ్చినందుకు చిరాకుపడిన నేను ఇప్పుడు ఎలా వెళ్ళాలా అని ఆలో చిస్తున్నాను. రాఘవయ్యగారు బేరం ఫైసలు చేసేస్తే ఆ మరునాడే నా ప్రయాణం.

ఆ రాత్రి నన్ను చూస్తూనే లీల "అలా ఉన్నారేం?" అంది.

నవ్వడానికి ప్రయత్నించాను. టానిక్ సీసా లీల చేతికి ఇచ్చి "రోజూ ఉదయం, సాయంత్రం రెండు చెంచాల నీళ్ళలో కలుపుకుని తాగు" అన్నాను.

"ఈ అప్పగింత లేమిటి? మీ రిస్తేకాని నేనేది తాగను." ఎంతో మామూలుగా అంది.

నా తల వంగిపోయింది. నా పెదిమలు తడబడు తున్నాయి. ఎలా చెప్పను? ఏమని చెప్పను? చెపితే ఏమవుతుంది?

"లీలా, మనమంతా ప్రవాహంలో కొట్టుకుపోయే ఆకులలాంటివాళ్ళం. ఏ గాలితాకిడికో ఏ రెండు ఆకులో కలుస్తాయి, సాగినంతదూరం కలిసి వెడతాయి. చివరకు ఏ గాలివిసురుకో విడిపోతాయి. స్మృతులు మాత్రం మిగుల్చుకొని వేటి దారిన అవి సాగుతాయి. అంతే కదూ!"

లీలకు నా మాటలు అర్థమయ్యాయో, లేదో తెలియదు.

"అవునేమోకాని, కొన్నికొన్ని ఆకులు గాఢంగా అతుక్కుపోతాయి. ప్రవాహావేగంకాని, గాలివిసురు కాని, మరేదికాని విడదీయలేవు. విడిపోవు!" నిర్లక్ష్యంగా నవ్వుతూ అంది.

ఏమిటీ విశ్వాసం? దీన్ని ఎలా ఛేదించను?

"నేను నీకు గుర్తుంటానా?"

"మీరు నాతోనే ఉంటారు."

"అలా నీలో ఉంచేసుకోగలిగే దార్ఢ్యం నీ కుందా?"

"మీ స్మృతే నా ఊపిరిగా బతుకుతున్నాను."

"నేను నీకు కనిపించకపోయినా. . ."

పడుకున్నదల్లా లీల దిగ్గున లేచి కూర్చుంది ఒక్క మాట లేక నావంక అయోమయంగా చూసింది.

ఆ చూపు ఎదుర్కోలేకపోయాను. నా హృదయం బాధతో మూలుగుతూంది. చటుక్కున అనేశాను: "నేను రేపు వెళ్ళిపోతున్నాను, లీలా!"

తల వంచుకొని అన్నాను. పది నిమిషాలవరకు తల ఎత్తలేదు.

తరవాత చూస్తే అక్కడ లీల లేదు. ఆశ్చర్యంగా చూశాను. తనకు ఉన్న నాలుగు చీరలూ గబగబ మడతలు పెట్టేస్తూంది.

"అదేమిటి, లీలా?"

"రేపే ప్రయాణమన్నారుగా! సర్దుకొంటున్నాను."

దిగ్భ్రాంతితో మలి పోయింది.

"నువ్వెలా రాగలవు, లీలా? నాకు పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. నా భార్య నా కనుకూలురాలు. ఆమెను నేను కష్టపెట్టలేను."

"అవన్నీ నా కెందుకూ? నేను మీతో ఉంటాను."

మరణం తప్పదని నిశ్చయించుకొన్న సైనికుడి తెగింపులా ఉంది లీల ధోరణి.

"ఏమిటి, లీలా, ఇది?" మందలింపుగా అన్నాను.

నా పాదాలను చుట్టుకుపోయింది

"నన్నెందుకు మందలిస్తారు? నే నేమన్నాను? నేనేం కోరాను? నాకు మీ ఇల్లాలిని కావాలనే ఆశ లేదు. మీ ఆస్తిలో వాటా అక్కర్లేదు. మీ హోదాను పంచుకోవాలని లేదు. బిడ్డా పాప అక్కర్లేదు. మీతో ఉండనియ్యండి. దిక్కులేనిదని చెప్పుకోండి. వంట మనిషని చెప్పుకోండి. సిగ్గుఎగ్గులు లేకుండా వెంట పడిందని చెప్పండి. నన్ను వదిలిపెట్టకండి!"

నాకూ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. "పరిస్థితి అర్థం చేసుకో, లీలా!"

"ఇంకా ఏం అర్థం చేసుకోను? నాకు మీ రున్నారని అర్థంచేసుకున్నాను. ఆప్యాయంగా నా శిరస్సు నిమిరిన మీ స్పర్శలోని ఆర్ద్రత అర్థంచేసుకున్నాను. నా చేతిని మీచేతిలో బంధించుకున్న స్థైర్యం అర్థంచేసుకున్నాను. నా కష్టాలన్నీ మరిపించే మీ మాటలలో మాధుర్యం అర్థం చేసుకున్నాను ఇంకా ఏం అర్థం చేసుకోగలను?"

"నన్ను క్షమించు, లీలా!"

"క్షమించనా? నేను క్షమించానవేస్తే మీరు నిర్విచారంగా వెళ్ళిపోగలరా? నేను మీకేం అన్యాయం చేశాను? నా కెందుకీ కఠినశిక్ష? సన్నిపాతజ్వరంలో ఎందుకు చావనియ్యలేదు? నా గదిలోకి ఎందుకు వచ్చారు? వచ్చినప్పుడు నే నడిగిన విషం ఎందుకియ్యలేదు? మీకోసమని నన్ను బతికించుకున్న మీరు నన్ను వదిలి ఎక్కడికి వెళతారు? మీరుకాక నాకీ లోక మేముంది? మీ సుఖసంతోషాలకు ఏవిధంగానూ అడ్డురాని నన్ను, సర్వప్రాణాలతోనూ మిమ్మల్ని ఆరాధించే నన్ను ఎందు కింత నిర్దాక్షిణ్యంగా హింసిస్తున్నారు? కొందరికి బతుకు కంటే మరణమే సౌఖ్యాన్ని ఇయ్యగలదు. ఆ అంతిమ సౌఖ్యాన్నికూడా నాకు దక్కనియ్యని రాక్షసత్వం మీలో ఎలా చోటుచేసుకుంది?"

ఆవేశంలో తల గోడకేసి కొట్టుకుంది. గభాలున పట్టుకున్నాను. నీరసంగా నామీద వాలిపోయింది. శూన్యంగా నావంక చూసింది. ఆ చూపులలో ఏ భావమూ లేదు బడబానలాన్ని తనలో ఇముడ్చుకున్న సముద్రంలా ఉంది.

"డ్యూమాస్ చెప్పాడు, ఆశ, నిరీక్షణ—ఈ రెండూ మానవాళి మరవకూడదని. నువ్వు చిన్నపిల్లవి. బ్రతుకంతా ముందుంది. ఒకనాటికి నీ జీవితం పరిమళాలు వెదజల్లే నందనవనం కావచ్చు. ఇలా కుంగిపోకు."

నా మాటలు లీల విందో లేదో, వింటే అర్థమయ్యాయో లేదో నాకు తెలియలేదు. అలాగే నిశ్చలంగా ఉంది.

కాలచక్రం ముందుకు నెట్టగా, విధి నడిపించగా మరునాడు ప్రయాణమయ్యాను. బండివాడు తొందర చేస్తున్నాడు. వెనక్కి తిరిగాను.

మనస్సు నిండిన మమత కళ్ళలో కరిగించుకుంటూ, ఆత్మాభిమానాన్ని పెదిమకింద పళ్ళతో నొక్కిపట్టుతూ, ఆశానురాగాలను నాతో సాగనంపుతూ, నిరాశా నిస్పృహలను హృదయంలో నింపుకుంటూ మూర్తీభవించిన శోకదేవతలాగ లీల వరండాలో నిలబడిఉంది.

బండివాడి మరొక హెచ్చరికతో బండిలో కూర్చున్నాను. ఫర్లాంగు దూరం నడిచాక బండివాడు "లీలమ్మగారు మీ కియ్యమన్నా" రని వంద రూపాయల కాగితం ఇచ్చాడు. తెల్లబోయాను. రాత్రి లీలకు తెలియకుండా లీల చేతిసంచిలో వంద రూపాయ లుంచాను. చూసుకొని పంపించేసింది. మనస్సు చివుక్కుమంది. 'నేను నిజంగా అన్యాయం చేశానా?' అని ఆత్మవిమర్శ చేసుకొన్నాను.

ఇదేదైనా కథ అయితే, కథానాయకుడు లీలను పెళ్ళి చేసుకుని ఉండేవాడేమో! జీవితంలో సాధారణంగా అలాంటివి జరగవు. నేను డాక్టర్ని. ఏదో ఒకవిధంగా లీల జ్వరం నయం చెయ్యటమే నా ధ్యేయం. ఆమె పరిస్థితినిబట్టి మానవసహజమైన సానుభూతి కలిగింది. మహాసముద్రంలో కొట్టుకుపోయేవాడు గడ్డిపోచను కూడా బలంగా పట్టుకున్నట్లు, ఆమె నా సానుభూతి చుట్టూ తన బ్రతుకు అల్లేసుకుంది. కానీ ఆమె బ్రతుకులో వెన్నెలలు నింపలేకపోయాను. మెరుపులా మెరిసి మాయమవుతున్నాను. తాత్కాలికంగా కళ్ళకు మిరుమిట్లుగొలిపే కాంతిరేఖలు ప్రసాదించిన మెరుపు మరుక్షణం అంధకారాన్ని మరింత దట్టం చేసినట్లు, నావల్ల కలిగిన ఆనందాభాస ఆమె దైన్యాన్ని ఇనుమడింపజేసింది. ముందుముందు ఆమె బ్రతుకులో చల్లని వెన్నెల జల్లులు కురవాలని మనసారా కోరుకోవడంకంటె నేను చెయ్యగలిగిం దేముంది? నేను దేవుడినీ కాను, దానవుడినీ కాను. సాధారణ మానవమాత్రుణ్ణి.

కాలచక్రంతో పోటీపడుతూ నా బండిచక్రాలు సాగిపోయాయి. ★

# మంజరి

## దాశరథి

ఎవ్వరు మీరు? బాలికలా?
ఎగిరే దీప జ్వాలికలా!

నవయువ గళ రుధిరముకోసం
నాలుక సాచే కాళికలా!

పువ్వుల చాటుగ కాటిడగా
బుసలిడు భుజగ పాళికలా!

ఒంటరి వారల గుండెలలో
మంటలిడే సుమ మాలికలా!

బ్రహ్మకు రిమ్మను కలిగించే
బొమ్మలు వ్రాసే తూలికలా!

ప్రాణస్నేహితులగు వారి
మధ్యన యేర్పడు చీలికలా!

భూలోకాన్నే పాలించే
ఏలికలకె పేలికలా!

అఖిలము తెలిసిన దేవునికే
అర్థముకాని ప్రహేళికలా!

తనువున్నన్నాళ్ళూ ఉడికిస్తూ
తనివే తీరని కోరికలా!

'శరధి' రచించే నాటికల
మురిపించే నవచూలికలా! *